సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభం



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ రేడియల్ రోడ్డుపై సెంట్రల్ లైటింగ్ సిస్టం పనులు ప్రారంభమయ్యాయి. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ మూడు రోజుల క్రితం పత్తికుంటను సందర్శించారు. ఈ సమయంలో స్థానికులు వీధి దీపాలు వెలగడం లేదంటూ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన జీహెచ్‌ఎంసీ అధికారులను వివరణ కోరగా పీడీపీ చౌరస్తా నుంచి మాయత్‌సాగర్ వరకు రేడియల్ రోడ్డుపై కొత్తగా చేపడుతున్న డివైడర్ పనుల నేపథ్యంలో వివిధ దీపాలు వెలగడం లేదని స్థానికులు తెలిపారు. దీంతో ఎమ్మెల్యే వెంటనే వీధి దీపాలు వెలిగేలా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో గురువారం ఉదయం పీడీపీ చౌరస్తా నుంచి పనులను ప్రారంభించారు. రేడియల్ రోడ్డుపై డివైడర్‌కు అనుసంధానం చేస్తూ వీధి దీపాల వైరింగ్‌ను బిగించారు. ఈ పనులను రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్ రెడ్డి, రగడంపల్లి శ్రవణ్ కుమార్, సాయి మాలిక్ తదితరులు పర్యవేక్షించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ ఆదేశాల మేరకు 100 రోజుల ప్రణాళిక ఒక మార్పు అభివృద్ధికి మలుపు కార్యక్రమంలో భాగంగా గురువారం 14వ డివిజన్‌లోని పీరంచెరువు ఆబాది ఏరియాలో తడి, పొడి చెత్తపై కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించి అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.రాజీకుమార్, జి.వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్ వసీఅలీ, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌పీలు, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త తొలగించరా?



పాఠశాల పక్కనే డంప్‌చేసిన చెత్త

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ప్రభుత్వ పాఠశాల ప్రాంతంలో వేసిన చెత్త ఇతర వ్యర్థాలను తొలగించాలని విద్యార్థులతో పాటు స్థానికులు కోరుతున్నారు. రెండు, మూడు రోజులుగా చెత్తాచెదారాలను తొలగించకపోవడంతో పరిసరాలు దుర్గంధభరితంగా తయారయ్యాని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల ప్రహరీ పక్కనే కొన్ని రోజులుగా చెత్తను డంప్ చేస్తున్నారు. దీంతో అదికాస్తా డంపింగ్ యార్డ్‌గా తయారైంది. గతంలో ఈ ప్రాంతంలో ఎలాంటి ఓపెన్ పాయింట్ లేదు. ప్రతివారం ఈ ప్రాంతంలో జరిగే సంత కూరగాయల వ్యర్థాలను తొలగించి ఈ ప్రాంతంలో డంపు చేస్తున్నారు. ఇదే అనువుగా స్థానికులు సైతం ఈ ప్రాంతంలోనే చెత్తను తీసుకొచ్చి వేస్తున్నారు. దీంతో ఇది కాస్తా చెత్తకుండీలా మారింది. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాల్సిన సిబ్బంది అందుకు అనుగుణంగా విధులు నిర్వహించకపోవడంతో ఈ సమస్య ఉత్పన్నం అవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎడతెరపి లేని భారీ వర్షాలకు చెత్త కుళ్లి మరింత దుర్వాసనను వెదజల్లుతోందంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులుఊ స్పందించి చెత్తను తక్షణమే తొలగించాలని కోరుతున్నారు.

మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఆర్థిక సాయం చేయాలి

చార్మినార్: విద్యుత్ ప్రమాదాలకు గురైన మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాల్సిన అవసరం ఉందని బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు టి.ఉమా మహేందర్ డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కారణంగా ఈ విద్యుత్ ప్రమాదాలు సంభవించాయన్నారు. బండ్లగూడ చౌరస్తాతో పాటు అంబర్‌పేట్‌లో జరిగిన విద్యుత్ ప్రమాదం మృతుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవడం కోసం ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఆయన కోరారు.



మేకలమండిలో పేరుకుపోయిన బురద



జియాగూడ వంద ఫీట్ల రోడ్డు ఇలా..

మేకల మండి.. బురద నిండి..

- బురదలో నుంచే వాహనాల రాకపోకలు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

జియాగూడ మండి, 100 ఫీట్ల రోడ్డులో పేరుకుపోతున్న బురద



కేసరి హనుమాన్ చౌరస్తాలో..

జియాగూడ: జియాగూడ రహదారులు వర్షాల ధాటిడికి కొట్టుకుపోయి గుంతలమయంగా మారాయి. ఇక 100 ఫీట్ల జాతీయ రహదారి పూర్తిగా బురదమయంగా మారింది. దీంతో రెండు దారుల్లో ఒకదారి మాత్రమే వాహనాలకు అనుకూలంగా ఉండడంతో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. జియాగూడ కమేళా దుస్థితి మరి అధ్వానంగా ఉంది. 15 రోజుల నుంచి వర్షం కారణంగా మండి పూర్తిగా బురదగా మారింది. దీంతో మేకల కొనుగోలు, స్లాటరింగ్‌కి వచ్చేవారు నానా ఇబ్బందులు పడుతున్నారు.

జాతీయ రహదారిలో పూర్తికాని పనులు..

నాలుగు ఏళ్లుగా కొనసాగుతున్న పైపులైన్ నిర్మాణ పనులు ఇంకా పూర్తి కాలేదు. రహదారిలో ఒక దారి పూర్తిగా పైపులైన్ నిర్మాణానికి సరిపోయింది. దీంతో రహదారి పూర్తిగా మట్టికుప్పలు, చెత్త కుప్పలు, మేకల విక్రయాలు, అక్రమ పార్కింగ్, చెత్త ట్రక్కులకు అడ్డుగా మారింది. అయితే ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సవాళ్లను అధిగమించేలా ఎదగాలి

జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ కృష్ణమోహన్‌రెడ్డి



ఎంజీఐటీలో జరిగిన ఓరియంటేషన్‌డేలో పాల్గొన్న అతిథులు

మణికొండ: ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేలా ఇంజనీరింగ్ విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఉందని జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో గురువారం మొదటి సంవత్సరం విద్యార్థులు, తల్లితండ్రులకు జరిగిన ఓరియంటేషన్‌డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ... విద్యార్థులు సామాజిక స్పృహను పెంపొందించుకోవటంతో పాటు స్వీయ అభ్యాసం, సాఫ్ట్ స్కిల్స్ నేర్చుకోవాలన్నారు. గౌరవ అతిథిగా హాజరైన డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ గ్లోబల్ హెడ్ మల్లాది చంద్రమోహన్ మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న తాజా పరిణామాలను గమనిస్తూ పోటీ ప్రపంచంలో నైపుణ్యంతో రాణించాలన్నారు. తమ లక్ష్యాలను చేరుకునేందుకు కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్‌ల మద్దతు తీసుకోవాలన్నారు. డీబీఎస్ టెక్ ఇండియా అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శాంతా మోనా భరద్వాజ్, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుధాకర్‌రెడ్డి, ప్రోగ్రామ్ కన్వీనర్ డి.వెంకట్‌రెడ్డి, పరీక్షల విభాగం డైరెక్టర్ అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.



శ్రీదేవి కళాశాలలో...

రోల్ మోడల్‌గా నిలవాలి...

ఇంజనీరింగ్ విద్యార్థులు ఇప్పటి వరకు ఉన్న చరిత్రలను తిరగరాసి రోల్ మోడల్‌గా నిలిచి కొత్త చరిత్రలను లిఖించేందుకు సిద్ధంగా ఉండాలని ఇన్వెస్కో ప్రైవేట్ లిమిటెడ్ హెచ్‌ఆర్ హెడ్ ప్రత్యూష శర్మ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లిలోని శ్రీదేవి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం మొదటి సంవత్సరం విద్యార్థులు, వారి తల్లితండ్రులకు నిర్వహించిన ఓరియంటేషన్ డేలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఇంజనీరింగ్ విద్యార్థులకు జీపీఏలతో పాటు ఆత్మవిశ్వాసం, జ్ఞానం, నెట్‌వర్కింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంతో ముఖ్యమన్నారు. ఉన్న సమయాన్ని, వనరులను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. కళాశాల సలహాదారు డాక్టర్ టి.రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ... విమర్శనాత్మక ఆలోచన, ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసం, ఇంటర్న్‌షిప్‌లు పొందటం ఎంతో అవసరం అన్నారు. కళాశాల వైస్ చైర్మెన్ డాక్టర్ కె. రాధాకిషన్‌రావు, పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కె.తులసీరాం, శిక్షణ అధిపతి ఎం.హర్షవర్దన్ తదితరులు పాల్గొన్నారు.

బుల్కాపూర్ నాలాను పునరుద్ధరించాలి



బుల్కాపూర్ నాలాలో వేసిన పైపులు

మణికొండ: బుల్కాపూర్ నాలా వారీగా నిర్మాణాలు వస్తుండటంతో దాన్ని పలు చోట్ల మూసి రాకపోకలు సాగిస్తున్నారని, వాటిని అరికట్టి వెంటనే నాలాను పునరుద్ధరించి చెరువుల కాలుష్యం, గండిపేట నీటి కాలుష్యాన్ని అరికట్టాలని బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పార్టీ అధ్యక్షుడు డి.సీతారాం ఆధ్వర్యంలో నాయకులు పుప్పాలగూడ రెవెన్యూ పరిధిలోని అపర్ణ జినాన్, సాస్ ఐనా నిర్మాణ సంస్థల మధ్యలో ఉన్న బుల్కాపూర్ నాలాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బుల్కాపూర్ నాలాను ఎక్కడికక్కడ పూడ్చివేతలు చేయటంతో వరద నీరు ఎటు పడితే అటు వెళ్తుందన్నారు. నాలాలో వచ్చే నీరు కొంత ముష్కి చెరువులో కలవాల్సి ఉండగా ఇటీవల దాన్ని అడ్డుకోవటంతో కాలనీల్లోకి చేరుతుందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని కాలనీలు ముంపునకు గురికావటంతో పాటు మురుగునీరంతా నాలా పక్కనే ఉన్న గండిపేట క్యాండూట్‌లోకి చేరి నీటిని కలుషితం చేసే అవకాశం ఉందన్నారు. ఇకనైనా ఇరిగేషన్, మున్సిపల్, హెచ్‌ఎండీఏ, జలమండలి శాఖల అధికారులు సమన్వయంతో బుల్కాపూర్ నాలా పరిశీలించి దాన్ని పునరుద్ధరించే పనులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు జి.నరేందర్, బి.ఉపేంద్రనాథ్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు, సంతోష్, రాజేంద్రప్రసాద్, దస్తగిరి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన



రాయన్నగూడలో అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

శంషాబాద్ రూరల్: బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై మండలంలోని రాయన్నగూడలో గురువారం రాత్రి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థులు గ్రామంలో నాటిక ప్రదర్శన చేశారు. బాల్య వివాహంతో ఆరోగ్యం సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు. ఆడ పిల్లలకు చదువు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. చదువుతో బాలికల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించవచ్చన్నారు. కుటుంబ ఆరోగ్యం, ఆర్థికాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ అభిప్రాయాలను వీరితో పంచుకున్నారు.

గణేశ్ మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

ఆర్‌జీఐఏ ఇన్‌స్పెక్టర్ బాలరాజు



శంషాబాద్: పట్టణంలో ఏర్పాటు చేసుకునే గణేశ్ మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఆర్‌జీఐఏ ఇన్‌స్పెక్టర్ కె.బాలరాజు స్పష్టం చేశారు. ఇందుకోసం ఆన్‌లైన్ ద్వారా కాని లేదా నేరుగా వచ్చి కాని దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమతి కోసం ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. గతేడాది ఆర్‌జీఐఏ పరిధిలో 209 గణపతి మండపాలను అనుమతి తీసుకున్నారన్నారు. ఈ ఏడాది కూడా ఇప్పటికే పలువురు నిర్వాహకులు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్నారన్నారు. అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు చోటు చేసుకోకుండా విద్యుత్ అధికారుల అనుమతితో వారి సూచనల మేరకు విద్యుత్ వినియోగం చేపట్టాలన్నారు. పట్టణంలోని కాముని చెరువు, తొండుపల్లి చెరువుల వద్ద మూడో రోజు నుంచే నిమజ్జనానికి క్రేన్‌లు అందుబాటులో ఉంటాయన్నారు. వినాయక చవితి నుంచి నిమజ్జనం వరకు విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు.

నియామకం



మాజీ మంత్రి సబితారెడ్డిని కలిసిన శంకర్‌రెడ్డి

శంషాబాద్: శంషాబాద్ పట్టణానికి చెందిన కూచిరెడ్డి శంకర్‌రెడ్డి నగరంలోని రాజ్‌బహదూర్ వెంకటరాంరెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యుడిగా నియమితులయ్యారు. జనరల్ సభ్యులుగా మొత్తం 17 పోటీలో ఉండగా ఐదుగురిని అందులోంచి ఎన్నుకున్నారు. అందులో కూచిరెడ్డి శంకర్‌రెడ్డి సభ్యులుగా నియమితులైనట్లు రిటర్నింగ్ అధికారి ప్రొఫెసర్ పి.వెంకట్‌రెడ్డి ఉత్తర్వులు అందజేశారు. ఈ నేపథ్యంలో గురువారం శంకర్‌రెడ్డి మాజీ మంత్రి సబితారెడ్డిని కలిశారు. విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న ఆర్‌బీవీఆర్‌ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీలో సభ్యులుగా నియమితులైనందుకు సబితారెడ్డి ఆయనను అభినందించారు.

చెట్లను నరికివేసిన సంస్థకు జరిమానా

మణికొండ: చెరువు అభివృద్ధి పేరుతో చుట్టూ ఉన్న పలు చెట్లను కొట్టడంతో ధృవాన్స్ ఎన్‌జీఓ సంస్థకు అటవీ శాఖ అధికారులు జరిమాన విధించారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల మధ్యలో ఉన్న ముష్కి చెరువు అభివృద్ధి పేరుతో ఓ నిర్మాణ సంస్థ నిధులతో ధృవాన్ష్ ఎన్‌జీఓ ఇటీవల పలు పనులను చేపట్టింది. అందులో బాగంగా చెరువు చుట్టూరా ఉన్న పలు చెట్లను తొలగించటం, చెరువు విస్తీర్ణాన్ని తగ్గించి కొత్తగా కట్ట ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. చెరువు కట్టను పూర్తిగా తొలగించాలని గతంలోనే హైడ్రా కమిషనర్ ఆదేశించారు. చెరువు పక్కనే నివసిస్తునన్న హాల్ మార్క్ వినిసియా, మై హోం అవతార్ వాసులు చెట్లను కొట్టడంపై అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు పరిశీలించి చెట్లను కొట్టిన విషయం వాస్తవమే అని నిర్ధారించి ఇటీవల రూ. 10వేల జరిమాన విధించారని నివాసితులు తెలిపారు. అభివృద్ధి పనులు చేపడతామని వచ్చిన సంస్థ చెరువును కుదించటం, వరద నీరు రాకుండా చేయటం, మురికి నీటిని చెరువులో కలపటం లాంటి పనులు చేసిందని వారు వివరించారు. రాబోయే రోజుల్లో సంస్థపై మరిన్ని జరిమానాలు, శిక్షలు పడే అవకాశం ఉందని వారు తెలిపారు.

ఆరోగ్య సూత్రాలను పాటించాలి



ఆరోగ్య సూత్రాలను వివరిస్తున్న సంస్థ ప్రతినిధులు

మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు వారి కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో ఆరోగ్య సూత్రాలు తెలుసుకునే అవకాశం తక్కువగా ఉంటుందని, అలాంటి వారికి ఉపాధ్యాయులు, సంస్థలు నేర్పించాల్సిన అవసరం ఎంతో ఉందని సుహర్ష్ ఫౌండేషన్ నిర్వాహకులు హితేషీదత్, అనిత అన్నారు. గురువారం మంచిరేవుల ప్రాథమిక పాఠశాలలో ఫౌండేషన్ తరపున విద్యార్థులు పరిశుభ్రంగా ఉండటం, చేతులు కడుక్కోవటం ప్రాముఖ్యతలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మన చేతుల నుంచే మనకు అనేక రోగాలు వస్తున్నాయని, వాటిని పరిశుభ్రంగా ఉంచుకోవటం, తరచూ కడుక్కోవటం వలన ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. ప్రధానోపాధ్యాయుడు బసవేశ్వర్, ఉపాధ్యాయులు శారద, కృష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి



చేనేత కార్మికులకు సన్మానిస్తున్న దృశ్యం

- పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాల్లకటి రాజ్‌కుమార్
- చేనేత కార్మికులకు ఘనంగా సన్మానం

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ఆదర్శ కాలనీలో తెలంగాణ పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాల్లకటి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదర్శ చేనేత సహకార సంఘం అధ్యక్షుడు పున్న కృష్ణయ్య అధ్యక్షతన 30 మంది చేనేత కార్మికులకు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అధ్యక్షుడు పున్న కృష్ణయ్య తెలంగాణ పద్మశాలీ ప్రతినిధులకు, అతిథులకు ఘనంగా శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ... చేనేత కార్మికులు ఎన్నో కష్టాలు పడుతూ తమ జీవితాన్ని గడుపుతున్నారన్నారు. నేతన్నల సంక్షేమం, అభ్యున్నతి కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. వారికి సరైన న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా చేనేత కార్మికులకు పింఛన్ విషయంలో న్యాయం జరిగేలా తమవంతు సహాయం అందిస్తామని తెలిపారు. ఏర్వ సత్యనారాయణ మాట్లాడుతూ... చేనేత కార్మికులు ఎంతో కష్టపడి సమాజానికి సేవ చేస్తున్నారన్నారు. వారి శ్రమకు సరైన గుర్తింపు రావాలన్నారు. ఈ సన్మానం వారిలో నూతనోత్సాహం కలిగిస్తుందన్నారు. భవిష్యత్తులో చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి మా పద్మశాలీ సంఘం కృషి చేస్తునందన్నారు. టీఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వనమాల శంకర్, ప్రధాన కార్యదర్శి వడిచెర్ల మారుతి, జాయింట్ సెక్రటరీ జోగి సూర్యప్రకాష్, సెక్రటరీలు ధ్రువకుమార్, శ్రీనివాస్, పద్మశాలీ ప్రతినిధులు మసున వెంకటేష్, గంజి వెంకటేష్, దొంత రాజు, బొల్ల నరేందర్, కొంపల్లి జగదీష్, మునిగాపాటి వెంకటేష్, శిరిసిల్ల నారాయణ, యేదిరే వెంకటేష్, ఏర్వ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఆర్పీలకు 'ఉల్లాస్' ట్రైనింగ్



శిక్షణలో పాల్గొన్న ఆర్‌పీలు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మున్సిపల్ రీసోర్స్ పర్సన్స్ (ఆర్పీ)లకు వియోజన విద్యలో నేర్పించేందుకు నిర్వహించే ఉల్లాస్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గండిపేట్ మండల విద్యా శాఖాధికారి (ఎంఈఓ) సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్, నార్సింగి మున్సిపాలిటీ, మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ ఆర్పీలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు సైదిరెడ్డి, రామేశ్వరి, ఆర్‌పీలు రాఘవేందర్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటను సందర్శించిన సీబీఐటీ విద్యార్థులు



మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) మొదటి సంవత్సరం విద్యార్థులు గురువారం గోల్కొండ కోటను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు మాట్లాడుతూ... ఇంజనీరింగ్ విద్యార్థులకు హైదరాబాద్ చరిత్ర, శిల్పకళ, సాంస్కృతిక వారసత్వం, సహకార భావన, బృందపని నైపుణ్యాలను, అనుభవాత్మక అభ్యాసం పెరుగుతుందన్నారు. ఇలాంటి యాత్రలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని, ఇంజనీరింగ్ విద్యార్థులు పలు రంగాలపై అవగాహన పెంచుకునేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ బి.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త కాల్చితే కఠిన చర్యలు



అవగాహన సదస్సులో పాల్గొన్న ఆర్‌పీలు, ఓబీలు

బండ్లగూడ: బహిరంగ ప్రదేశాల్లో చెత్తను కాల్చడం వల్ల జరిగే అనర్థాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. గురువారం వివిధ కాలనీ ప్రజలకు, హైదర్షాకోట్ ప్రభుత్వ పాఠశాలలో అర్‌పీలు, ఓబీలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఇంట్లో రోజు వారి చెత్తను వేరు చేసి మున్సిపల్ ఆటోలకు అందించాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో చెత్తను కాల్చడం, పారేయడం నిషేధించారన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను కాల్చడం, పారవేసే వారిపై ప్రభుత్వ బంధనల ప్రకారం తగిన జరిమానా, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీఎంసీ ఎస్.శ్రీలత, ఆర్‌పీలు, ఓబీలు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అత్తాపూర్: అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే ఉద్యోగులు అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందని ఐఆర్‌ఎస్‌డీ డైరెక్టర్ రవీందర్‌కుమార్, రాజేంద్రనగర్ అగ్నిమాపక కేంద్రం ఫైర్ ఆఫీసర్ చంద్రనాయక్ సూచించారు. అగ్ని మాపక సమస్యలు, ప్రమాదాలపై గురువారం అత్తాపూర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్ ట్రైనింగ్ సెంటర్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బిల్డింగ్ సముదాయంతో పాటు ఉద్యోగులు ఉన్న ప్రాంతంలో జరిగే అగ్నిమాదాలపై ఆందోళన చెందకుండా అప్రమత్తంగా ఉంటే ఆపద నుంచి బయటపడొచ్చన్నారు. ఫైర్ సెక్యూరిటీ సందర్భంగా ఏర్పాటు చేసుకున్న అగ్నిమాపక నియంత్రణ పరికరాలతో జరిగిన ప్రమాదాల నుంచి రక్షించుకోవడం పై అవగాహన కార్యక్రమంలో సంబంధిత అధికారులకు పూర్తిగా వివరించారు.